క్లుప్తంగా

బీజేపీ మండలాధ్యక్షుడిగా నవీన్‌గుప్తా



నియమాక పత్రం అందుకుంటున్న నవీన్

టేక్మాల్(మెదక్): బీజేపీ మండలాధ్యక్షుడిగా టేక్మాల్‌కు చెందిన డాకప్పగారి నవీన్‌గుప్తా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ఉత్తర్వులు అందించినట్లు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రెండోసారి పార్టీ మండలాధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు నవీన్‌గుప్తా పార్టీ పెద్దలకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అందరితో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఇందులో పార్టీ జిల్లా కార్యదర్శి నాయికోటి శ్యామయ్య, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రెడ్యా నాయక్, పార్టీ నాయకులు సిద్ధు, రాజు, దుర్గాప్రసాద్, పుండరీకం, సుదర్శన్‌రెడ్డి, రాములు, శివాగౌడ్, సుదర్శన్, సేనాపతి తదితరులు ఉన్నారు.

స్వచ్ఛతే లక్ష్యంగా..



జీడిపల్లిలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న యువత

మనోహరాబాద్(తూప్రాన్): స్వచ్ఛతే లక్ష్యంగా యువత గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నారు. మండల పరిధిలోని జీడిపల్లి గ్రామ యువత ఆదివారం 5వ వారం స్వచ్ఛ భారత్ చేపట్టి గ్రామంలోని పలు వీధులను శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను తొలగించారు. రామాలయం వద్ద ఉన్న చెత్త చెదారాన్ని తొలగించారు.

పొట్టు లారీలకు కట్టడి ఏదీ?



తూప్రాన్ - నర్సాపూర్ హైవే పై వెళ్తున్న పొట్టులారీ

శివ్వంపేట(నర్సాపూర్): నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై వెళ్తున్న పొట్టు లారీలపై చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. బాడీ కంటే అదనంగా ఇరువైపుల పొట్టు నింపిన లారీ, డీసీఎంలు తూప్రాన్ - నర్సాపూర్ హైవే గుండా నిత్యం వెళ్తుంటాయి. వీటితో రోడ్డు పూర్తిగా కప్పేయడం మూలంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ వాహనాలు వెళ్తున్నప్పుడు పొట్టు పడుతుండడం వల్ల వీటి వెనకాల వస్తున్న ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడుతున్న సంఘటనలు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి పొట్టు లారీలపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



నస్కల్‌లో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ సిద్ధిరాములు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలో గ్రామంలో నస్కల్ గ్రామంలో ఎస్సీ కాలనీలోని డ్రైనేజీకి ఆదివారం ఎంపీపీ సిద్దిరాములు నూతన డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.ఒక లక్ష 71 వేల నిధులు మంజూరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మాగౌడ్, నగేశ్, దుర్గయ్య, మన్నె రమేశ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న దాత

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లోని గోకర్ణేశ్వర ఆలయంలో శనివారం అర్చకుడు మహేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచారు. కాగా దాత సంతోష్ గుప్తా అన్నదానం

ఆలయాల్లో భక్తుల సందడి



బగలాముఖి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠానికి ఆదివారం భక్తజనం పోటెత్తారు. అమావాస్యను పురస్కరించుకొని వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పబ్బ రమేశ్‌గుప్తా అన్నదానం చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నరేంద్రనాథ్‌తో పాటు పలువురు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

కౌడిపల్లి(నర్సాపూర్): డప్పు చప్పుడు, శివసత్తుల పూనకాలతో ఆదివారం మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయం భక్తులతో రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పురోహితులు శివ్వప్ప, రాజేశ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనాలు తీసి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డప్పు చప్పుళ్ల, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. పలువురు భక్తులు తలనీలాలలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు వెంకట్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లు చేశారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పట్టణానికి చెందిన వ్యాపారులు హైమవతి రాఘవులు కుటుంబ సభ్యులు అమావాస్యను పురస్కరించుకొని ప్రసన్నాంజనేయ స్వామికి ఆలయ అర్చకుడు గౌడిచర్ల హరిప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



హోమం వద్ద భక్తులు



నల్లపోచమ్మదేవికి పూజలు చేస్తున్న భక్తులు

మానవ జీవనానికి బాల్యమే మూలాధారం

- ప్రముఖ సైకాలజిస్ట్ సోనాల్ రవి అండ్రూస్
- సొచ్ స్వచ్ఛంద సంస్థకు రూ.7,77,777 విరాళం

మెదక్ మున్సిపాలిటీ: మానవ జీవన వృక్షానికి బాల్యమే మూలాధారమని, విద్యార్థులకు చిన్నతనం నుంచే నైతిక విలువలు, క్రమశిక్షణ, శ్రద్ధ వంటి లక్షణాలను తల్లిదండ్రులు నేర్పించాలని ప్రముఖ సైకాలజిస్ట్ సోనాల్ రవి అండ్రూస్ సూచించారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలోని వెంకట్రావు నగర్ కాలనీలోని సిద్ధార్థ విద్యా సంస్థల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవి అండ్రూస్ విద్యార్థులకు పట్టాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య దశలోని దైవత్వం గురించి వివరించారు. విశిష్ట అతిథి ఇబ్రోడ్ సంస్థ నిర్వాహకులు మధుకర్ రెడ్డి మాట్లాడుతూ.. గురువులు విద్యార్థులకు నేర్పే విద్య, దీపం లాంటిదని, ఆ వెలుతురులో చిన్నారులు తమ భవిష్యత్‌కు దారిని తెలుసుకొని నడవాలని సూచించారు. సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, సెక్రటరీ సంధ్యారాణి మాట్లాడుతూ.. జీవితమనే వినీలాకాశంలో విద్యార్థులు చక్కగా ఎగరడానికి అర్హత, యోగ్యత అనే రెండు రెక్కలు అవసరమని విద్యావిధానాన్ని తెలియజేశారు. అనంతరం సిద్ధార్థ విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం కలిసి అంధ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సొచ్ స్వచ్ఛంద సంస్థకు రూ.7,77,777లను విరాళంగా అందజేశారు. అనంతరం చిన్నారుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ఇన్‌చార్జిలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



స్నాతకోత్సవంలో విద్యార్థులు

సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివి



రామాయంపేటలో పూలే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



నస్కల్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళలు

రామాయంపేట(మెదక్): సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివని బీసీ సంఘం నాయకులు అన్నారు. పట్టణంలో ఆదివారం సావిత్రిబాయి పులే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీసీ సంఘం నాయకులు ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఎంపీపీ సిద్ధరాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. సావిత్రి బాయి పూలే మార్గంలో ప్రతీ ఒక్కరూ నడవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సిద్ధరాములు, నాతి లక్ష్మాగౌడ్, పాగాల నగేశ్, చాకలి రవి, మహిళలు కవిత, వాణి, వినోద, బాలరాజవ్వ, కాలనీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపు

- మైనంపల్లి హన్మంతరావు

మనోహరాబాద్(తూప్రాన్): కరాటేతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని మాజీ ఎమ్మెల్యేలు హన్మంతరావు, నర్సారెడ్డి అన్నారు. ఆదివారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని శుభం గార్డెన్‌లో షన్‌షైన్ షోటోకాన్ కరాటే క్లబ్ మాస్టర్లు మల్లేశ్, నర్సింగరావుల ఆధ్వర్యంలో జరిగిన రెండో ఇంటర్నేషనల్ లెవల్ ఓపెన్ కరాటే - కుంగ్‌ఫూ చాంపియన్ షిప్ - 2024 పోటీలకు ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ పోటీలకు కర్నాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మల్లారెడ్డి, మహిపాల్‌రెడ్డి, మద్దూరి నాగరాజు, నాగరాజు, సత్యనారాయణ, కల్యాణ్, గ్రాండ్ మాస్టర్లు సాయికుమార్, సాయి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు హన్మంతరావు, నర్సారెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్‌లో చేరికలు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని జీడిపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. చేరిన వారిలో మాజీ ఉప సర్పంచ్ పాండుగౌడ్, ఆంజనేయులు, సుధాకర్, ఉద్యమకారులు గొల్లరాజు, రాజుగౌడ్, నాయకులు స్వామి, లింగం చేరారు. ఈ కార్యక్రమంలో జీడిపల్లి కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు నవీన్, నాయకులు మాజీ సర్పంచ్ నాగేశ్, మండల నాయకులు రాగం శ్రీనివాస్‌గుప్తా, యాదగిరి తదితరులున్నారు.

◆ విజయసంకల్ప సభకు తరలిరండి

చేగుంట(తూప్రాన్): హైదరాబాద్‌లో జరిగే విజయసంకల్ప సమ్మేళన సభకు కార్యకర్తలు తరలి రావాలని దుబ్బాక నియోజకవర్గ కన్వీనర్ ఎస్ఎన్ చారి అన్నారు. ఆదివారం చేగుంట ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో జరిగే సమ్మేళన సభకు అమిత్‌షా హాజరవుతున్నారని కార్యకర్తలు సమ్మేళనానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చేగుంట, నార్సింగి మండలాల అధ్యక్షుడు భూపాల్, నాయకులు సంతోష్ రెడ్డి, బాల్‌రెడ్డి నర్సింలు, సంతోశ్, శేఖర్, చంద్రశేఖర్‌గౌడ్‌తో పాటు పలు గ్రామాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

◆ ఆర్థిక సాయం



చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లి గ్రామానికి చెందిన రెడ్డి భిక్షపతి ఆర్థిక ఇబ్బందులతో నెల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో అతని స్నేహితులు బాధిత కుటుంబానికి చేయుతనందించారు. చిన్నశంకరంపేట జెడ్పీపాఠశాలలో 2006 పదో తరగతి కలిసి చదువుకున్న మిత్రులు కలిసి మృతుడి కూతురు నీలిమా పేరున పోస్ట్ ఆఫీస్‌లో రూ.40 వేలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ బాండ్‌ను ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంతోష్‌గౌడ్, పృథ్విరాజ్, నరేశ్, శ్రీమాన్, పసుల రమేశ్, కుర్మ రమేశ్, ప్రవీణ్, నరేశ్, ప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ సన్మానం

నర్సాపూర్: పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌ను ఆదివారం ఎల్లమ్మ ఆలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. తమ సంఘం సభ్యుడు మున్సిపల్ చైర్మన్ కావడం తమకు సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



◆ చెరువులో పడి వ్యక్తి గల్లంతు

నర్సాపూర్ రూరల్: ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి గల్లంతైన ఘటన నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంట మేళ్ల చెరువు చెరువులో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముద్దం బాలేశ్ (40) పాడి గేదెలకు నీరు తాగించేందుకు సమీపంలోని మేళ్ల చెరువుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చెరువు వద్దకు వెళ్లి గాలించినా ఆచూకీ దొరకలేదు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ పుష్ప రాజ్ ఘటనా స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో వెతికించారు. అయినా దొరక్క పోవడంతో చీకటి పడడంతో తిరిగి సోమవారం ఉదయం తిరిగి గాలిస్తామని తెలిపారు.

◆ నేడు కౌడిపల్లిలో సర్వసభ్య సమావేశం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ రాజునాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ఆరోజు ఉదయం 11గంటలకు జరిగే సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, గ్రామ ప్రత్యేకాధికారులు, మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని చెప్పారు.



బండ్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు

కొనసాగుతున్న దుర్గాదేవి ఉత్సవాలు

- ఆకట్టుకున్న బండ్ల ఊరేగింపు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహ్మద్‌నగర్‌లో దుర్గాదేవి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం గ్రామస్తులు పాచిబండ్ల ఊరేగింపును కనులపండువగా నిర్వహించారు. గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు దుర్గాదేవి ఆలయం చుట్టూ బండ్లను ఊరేగించారు. అనంతరం గ్రామానికి చెందిన జనార్దన్‌రెడ్డి ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దివ్య, నాయకులు మహిపాల్‌రెడ్డి, రఘు, వెంకట్‌రెడ్డి, వెంకన్న, ధన్‌సింగ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మతల్లికి బోనాలు



బోనాలు ఎత్తుకున్న మహిళలు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో సోమేశ్వర బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి గ్రామస్తులు బోనాలను ఊరేగించి పోచమ్మతల్లికి సమర్పించారు. ఈ సందర్భంగా మైనంపల్లి హన్మంతరావు భార్య వాణి సోమేశ్వరాలయ కమిటీ ఏర్పాటు చేసిన బోనాన్ని ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. ఈ మేరకు మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజుల విన్యాసం, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గంగా నరేందర్, శ్రీమాన్‌రెడ్డి, మనోజ్, గుడ్డు తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో పూజలు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని సోమేశ్వరాలయంలో మైనంపల్లి హన్మంతరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డితో కలిసి సోమేశ్వరాలయం సందర్శించారు. ఈ సందర్భంగా వేదపండితులు సంగమేశ్వరశర్మ, శివప్రసాద్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శివలింగాభిషేకం నిర్వహించి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషిచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నశంకరంపేట తాజామాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జీవన్, కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, మనోజ్, మాజీ ఏఎంసీ చైర్మన్ నరేందర్, మాజీ ఎంపీపీలు శ్రీమాన్‌రెడ్డి, అరుణప్రభాకర్, మాజీ సర్పంచ్‌లు జనార్దన్, సుధాకర్, మేడి గణేశ్, అంజాగౌడ్, రామచంద్రం పాల్గొన్నారు.



శివలింగానికి అభిషేకం చేస్తున్న మైనంపల్లి హన్మంతరావు

నిరుపేదలకు దుస్తుల పంపిణీ

శివ్వంపేట(నర్సాపూర్): దివంగత శివ్వంపేట మాజీ సర్పంచ్ ప్రసాద్‌గౌడ్ జ్ఞాపకార్థం ప్రజల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తరించనున్నట్లు ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం ప్రసాద్‌గౌడ్ 20 వర్ధంతి సందర్భంగా గూడూర్ గ్రామంలో ఆయన విగ్రహానికి వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామస్తులకు దుస్తులు, కుట్టుమిషిన్లు, నిరుపేదలకు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రస్ట్ ద్వారా ముఖ్యంగా పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనతో పాటు పేద విద్యార్థులకు చేయూతనందిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు బోరుబావుల తవ్వకంతో పాటు అభివృద్ధి పనులు చేసిన విషయం గుర్తు చేశారు. రానున్న కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సూర్యకుమార్‌గౌడ్, నర్సయ్య, కొండల్, వెంకటేశ్, యాదగిరి, మైసయ్యయాదవ్, సత్యనారాయణ, చిన్న, తదితరులు ఉన్నారు.



పేదలకు దుస్తులు అందజేస్తున్న శివకుమార్‌గౌడ్

అమిత్‌షా పర్యటన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

- బీజేపీ మండలాధ్యక్షుడు రాకేశ్

కౌడిపల్లి(నర్సాపూర్): కేంద్ర ప్రభుత్వ పథకాలలో లబ్ధిదారులతో సెల్ఫీ కార్యక్రమాన్ని బీజేపీ కార్యకర్తలు విజయవంతం చేయాలని మండలాధ్యక్షుడు రాకేశ్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని వెంకట్రావ్‌పేటలో సెల్ఫీ కార్యక్రమం, ఈనెల 12న అమిత్‌షా పర్యటన కార్యక్రమాల వాల్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వ పథకాలు పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి, ఉజ్వల యోజన, ఉపాధిహామీ తదితర పథకాలలో లబ్ధిపొందిన ప్రజల వద్దకు వెళ్లి సెల్ఫీ దిగి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతీ గ్రామం తండాల్లో సెల్ఫీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. దీంతోపాటు ఈనెల 12న హైదరాబాద్ అమిత్‌షా పర్యటనకు భారీగా జనం తరలివచ్చి విజయవంతం చేయాలని ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహిపాల్, శేఖులు, మల్లేశ్, భిక్షపతి, శేఖర్, సతీశ్, హరీశ్, నాగభూషణం, రాజు, ఆంజనేయులు, పాపయ్య, సంతోష్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ మండలాధ్యక్షుడు రాకేశ్